రాజీనామాకు ససేమిరా?
- నోటి మాటతో చెబితే చేయను, రాతపూర్వకంగా ఇవ్వాల్సిందే
- మొండికేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి
- ఆ ఉత్తర్వులు తీసుకుని న్యాయ స్థానానికి వెళ్లే యోచన

.5లో



కొత్త కలెక్టర్ ముంగిట పెను సవాళ్లు



నేడు కలెక్టర్‌గా ఏఎస్.దినేశ్‌కుమార్ బాధ్యతల స్వీకారం

- కలెక్టరేట్, ఐటీడీఏ కార్యాలయాలను గాడిన పెట్టడమే ప్రధానం
- పేషీలతో పాటు పలు ప్రభుత్వ శాఖల ప్రక్షాళన అనివార్యం
- కలెక్టర్ చొరవ తీసుకోకుంటే గత పరిస్థితులే కొనసాగే అవకాశం



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్

కొత్త కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పాలన కుంటుపడింది. అభివృద్ధి పడకేసింది. వ్యవస్థలు గాడి తప్పాయి... ఈ తరుణంలో కొత్తగా వచ్చే కలెక్టర్‌కు ఇవి పెను సవాళ్లు విసురుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ మూలాలున్న కలెక్టరేట్, ఐటీడీఏ కార్యాలయాల పేషీల నుంచే ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమించిన ప్రస్తుత ప్రకాశం కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పాడేరు కేంద్రంగా జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తయినప్పటికీ ఐటీడీఏ స్థాయిలో పాలన సాగడంతో జిల్లా ఏర్పడిన అనుభూతి పాలనలో కనిపించలేదు. గిరిజన ప్రాంతానికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు గిరిజనాభివృద్ధి, అందుకు ఉద్దేశించి ఏర్పడిన ఐటీడీఏలు, కొత్తగా వచ్చిన కలెక్టరేట్ తదితరాలపై కనీసం దృష్టి సారించిన దాఖలాలు లేవు. కేవలం వారి వ్యక్తిగత పనులు, ఆదాయ వనరులు మినహా గిరిజన ప్రాంతంలో పాలనను కనీసం పట్టించుకోలేదు. దీంతో కలెక్టరేట్, ఐటీడీఏ కార్యాలయాలు సైతం పూర్తిగా గాడి తప్పాయి. దీంతో ఏదోలా కాలం గడుపుతున్నట్టుగానే ఉంది కానీ, పాలన సాగుతున్నట్టుగా ప్రజలకు అనిపించడం లేదు. ఈ తరుణంలో ప్రభుత్వం మారడం, ఉత్సాహవంతుడైన ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్‌ను కలెక్టర్‌గా నియమించడంతో గత దుస్థితికి చరమగీతం పాడడంతోపాటు వ్యవస్థలు గాడిన పడి, గిరిజనాభివృద్ధికి బాటలు పడతాయని మన్యంవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పేషీల నుంచి ప్రక్షాళన అవసరం

వైసీపీ మూలాలున్న కలెక్టరేట్, ఐటీడీఏ కార్యాలయాల పేషీల నుంచే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం



పాడేరులో ఐటీడీఏ కార్యాలయం

ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కలెక్టరేట్ పేషీలో సీసీల సూచనలు, మార్గదర్శకాల ఆధారంగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి కలెక్టర్ సూచించినది అమలు చేయడానికి మాత్రమే సీసీలుంటారు. కానీ ఇక్కడున్న పరిస్థితుల దృష్ట్యా సీసీలకు కాస్త అవకాశం ఇవ్వడంతో దానిని ఆసరాగా చేసుకుని కలెక్టర్లనే తప్పుదారి పట్టిస్తున్నారని పలు శాఖలకు చెందిన అధికారులు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు కాల్ చేస్తే లిఫ్ట్ చేస్తారని, అదే సీసీకి కాల్ చేస్తే సరిగా స్పందించరని జిల్లా స్థాయి అధికారులే బాధపడిన సందర్భాలున్నాయి. అలాగే ఐటీడీఏలోనూ ఇదే పరిస్థితి గత కొన్నాళ్లుగా కొనసాగుతున్నది. ఐటీడీఏ పీవోకు సీసీగా ఉన్నవారిపై పూర్తిగా ఆధారపడడంతో ఇదే అవకాశంగా భావించి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఐటీడీఏ గత పీవో వద్ద సీసీగా వ్యవహరించిన వ్యక్తి, సదరు పీవోకు చెడ్డ పేరు తేవడంతోపాటు, తను బాగానే సంపాదించాడని, ఇప్పటికీ అదే సంస్కృతి ఐటీడీఏ పీవో పేషీలో కొనసాగుతున్నదని అధికారులు, పలువురు కాంట్రాక్టర్లు అంటు న్నారు. ఈ తరుణంలో కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు చెందిన పేషీలతోనే ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తోంది. పాడేరు కేంద్రంగా జిల్లా ఏర్పడినప్పటికీ కలెక్టర్, జేసీ, ఎస్పీ, కలెక్టరేట్‌లోని విభాగాలు మినహా ఇతర శాఖలకు చెందిన అధికారులు ఏం చేస్తున్నారో ... మిగతా 6వ పేజీలో



పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత సమాజం లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.

ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అలవాటు పడకూడదన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రధానంగా గంజాయి సాగు, వినియోగం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని చెప్పారు. ఏజెన్సీలో గంజాయి సాగును నిర్మూలించామని, ఒడిశాకు సరిహద్దున ఉండడంతో గంజాయి రవాణా జరుగుతున్నదన్నారు. విద్యార్థులు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు గంజాయి, డ్రగ్స్ వల్ల వ్యక్తిగతంగా తమకు, సమాజానికి కలిగే నష్టాలను గుర్తించాలని, వాటిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వైద్యులు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం, రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్పీ కె.ధీరజ్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమం సెబ్ సూపరింటెంట్ శ్రీనివాసరావు, కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.హేమలత, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదబయలు ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంటర్ ఫస్టియర్‌లో 67 శాతం ఉత్తీర్ణత

- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

పాడేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,655 మంది ఇంటర్ తొలి ఏడాది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకాగా, వారిలో 1,766 మంది ఉత్తీర్ణత(67శాతం) సాధించారు. మిలిగిన 889 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. అలాగే ఇంటర్ తొలి ఏడాది ఒకేషనల్ విద్యార్థులు 434 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా, 255 మంది పాస్ కావడంతో 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 179 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.

టెన్త్ సప్లిమెంటరీలో 78 శాతం ఉత్తీర్ణత

పాడేరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 78 శాతం ఉత్తీర్ణతను సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,015 మంది విద్యార్థులకు గానూ 794 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే వారిలో 579 మంది బాలురకు గానూ 431 మంది(74 శాతం), 436 మంది బాలికలల్లో 363(83 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణత ఆశాజనకంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్ష బీభత్సం

ఏజెన్సీ అంతటా వాన

- అరకు ఘాట్ రోడ్డులో విరిగి పడిన భారీ వృక్షాలు
- నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- రహదారులు జలమయం
- వాహనచోదకులకు ఇబ్బందులు

పాడేరు, జూన్ 26:(ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీలో నైరుతి ప్రభావం కొనసాగుతున్నది. ఏజెన్సీ వ్యాప్తంగా బుధవారం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సాధారణ వాతావరణం కొనసాగి ఎండకాసింది. ఆ తరువాత ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. వాగులు ఉధృతంగా ప్రవహించాయి. అరకు ఘాట్ రోడ్డు గన్నెల జంక్షన్ సమీపంలో ఓ కారుపై భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. అందులోని ప్రయాణికులు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పాడేరులో బుధవారం మధ్యాహ్నం ఒక మోస్తరు వర్షం కురవగా స్థానిక ఘాట్ మార్గంలో పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా, పంట పొలాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. తాజా వర్షాలు వేసవి దుక్కి పనులకు అనుకూలిస్తాయని రైతులు అంటున్నారు. కాగా హుకుంపేటలోని రాళ్లగెడ్డ, పాడేరులోని బుంగాగెడ్డ, చిలకలమామిడిగెడ్డ, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మత్స్యగెడ్డ, డుంబ్రిగుడలో చాపరాయిగెడ్డ వర్షంపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



అరకు ఘాట్ రోడ్డు గన్నెల జంక్షన్ సమీపంలో కారుపై పడిన భారీ వృక్షాలు



డుంబ్రిగుడలో పొలాలు నీట మునిగి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



పాడేరు- అరకులోయ మెయిన్‌రోడ్డులో వర్షం

వృక్షాలు విరిగిపడి నిలిచిన ట్రాఫిక్

అరకులోయ: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాయగా, ఆ తరువాత నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. సాయంత్రం 6 గంటల సమయంలో గన్నెల జంక్షన్ వద్ద కారుపై మూడు వృక్షాలు విరిగి పడ్డాయి. అరకులోయ నుంచి సుంకరమెట్టకు వెళుతున్న రాజ్‌కిరణ్ దంపతులు ఆ కారులో ఉన్నారు. వృక్షాల కొమ్మలు పడి కారు అద్దాలు పగిలిపోయింది. అయితే వారు సురక్షితంగా బయట పడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కాగా వృక్షాలు విరిగిపడడంతో సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక యువకులు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆ వృక్షాల కొమ్మలను కత్తించడంతో రాత్రి 9 గంటలకు వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. దీని వల్ల వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో బుధవారం భారీ వర్షం పడింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఇప్పటికే వరి విత్తనాలు నారు వేసిన రైతులు నీట మునిగిపోతాయని ఆందోళన చెందుతున్నారు.



హుకుంపేటలో వర్షం

గిరిజన ప్రాంతంలో సేవలందించడం అదృష్టం

కలెక్టర్ ఎం.విజయ సునీత

పాడేరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సేవలందించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. ఆమె బదిలీ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో పక్కా వ్యూహంతో ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించామన్నారు. మోదకొండమ్మ ఆశీస్సులతో జిల్లాలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నాలుగు నెలలు అధికారులతో పని చేశానని, ఆశించిన స్థాయిలో ప్రజలకు సేవలందించలేకపోయానన్నారు. రాజకీయ పార్టీల నేతలు, విలేకరులు చక్కని సహకారం అందించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో సామాజిక పింఛన్లు, వైద్య పరమైన సేవల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపామన్నారు. జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు ఎన్నికల సమయంలో చక్కని సహకారం అందించారని, మోదకొండమ్మ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ... మిగతా 6వ పేజీలో



కలెక్టర్ విజయసునీతను సత్కరిస్తున్న జేసీ, తదితరులు

హైస్కూళ్లలో ఉచిత భోజన, వసతి కల్పనకు చర్యలు

- డీఈవో బ్రహ్మాజీరావు

గూడెంకొత్తవీధి, జూన్ 26: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు తెలిపారు. బుధవారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఆయన పర్యటించారు. పెదవలస, లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో డీఈవో భోజన, వసతి సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల్లో సీట్ల కోసం విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. లంబసింగి, పెదవలస ప్రభుత్వ పాఠశాలలు డే స్కూళ్లు కావడం, వసతి సదుపాయం లేకపోవడం వల్ల విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడంలేదన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు హాస్టల్ సదుపాయం కల్పిస్తే విద్యార్థుల విద్యాభ్యాసానికి అనువుగా ఉంటుందన్నారు. ఈ మేరకు కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి మండల విద్యాశాఖాధికారి తగ్గి సత్యనారాయణ, నారాయణరావు, పనసల ప్రసాద్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు



జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన పీవీ సత్యనారాయణకు బుధవారం విశాఖపట్నంలోని సంస్థ కార్యాలయంలో చెక్కు అందిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, పక్కన యాడ్ మేనేజర్ చక్రవర్తి



జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన రూపాదేవికి చెక్కు అందిస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధి జె.శ్రీనివాస్



రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి గెల్చుకున్న మామిడి వేద వర్షకు చెక్కు అందిస్తున్న గాజువాక ఆంధ్రజ్యోతి ప్రతినిధి మస్తాన్



జిల్లా స్థాయిలో రెండో బహుమతి గెల్చుకున్న డి.తాతారావుకు చెక్కు అందిస్తున్న దృశ్యం



జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచిన టి.నరసింగరావుకు చెక్కు ఇస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధి శ్రీనివాస్

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలకు చెక్కులు పంపిణీ

- ఉమ్మడి విశాఖ జిల్లాలో గెలుపు గుర్రాలను సరిగా అంచనా వేసిన నలుగురికి నగదు బహుమతి
- రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి దక్కించుకున్న గాజువాకకు చెందిన మామిడి వేద వర్ష

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా ఎవరు నిలుస్తారన్న దానిపై సరిగా అంచనా వేయాలంటూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక యాజమాన్యం నిర్వహించిన 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు విజేతలుగా నిలిచారు. మొత్తం 15 నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై సరైన అంచనా వేసిన వందలాది మంది తమ కూపన్లను 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపించారు. వాటిని ఈ నెల ఐదోతేదీన విశాఖ ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయంలో లాటరీ తీసి, విజేతలను ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన ఒకరు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతిని దక్కించుకోగా, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులకు నలుగురు ఎంపికయ్యారు. విజేతలకు బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయిలో మూడో బహుమతిని గాజువాక ప్రాంతానికి చెందిన మామిడి వేదవర్ష గెల్చుకున్నారు. ఈమెకు స్థానిక సిబ్బంది రూ.10 వేలు చెక్కును అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన యర్రా రూపాదేవి రూ.10 వేలు గెల్చుకున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన తెప్పల నరసింగరావు, విశాఖ జిల్లా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన పీవీ సత్యనారాయణ, గాజువాక పరిధి వడ్లపూడి ప్రాంతానికి చెందిన ద్రోణాద్రి తాతారావు విజేతలపై స్పష్టమైన అంచనాతో ద్వితీయ బహుమతి కింద రూ.5 వేలు చొప్పున దక్కించుకున్నారు. ఈ నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులు 13 స్థానాల్లో, వైసీపీ రెండు స్థానాల్లో విజయం సాధిస్తారని కచ్చితంగా అంచనా వేశారు. ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5 వేలు బహుమతి గెల్చుకున్న పీవీ సత్యనారాయణకు బుధవారం 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, అడ్వైర్టెజ్‌మెంట్ విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాసచక్రవర్తి నగరంలోని కార్యాలయంలో చెక్కును అందించారు. మిగిలిన విజేతలకు ఆయా ప్రాంతాల్లోని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు చెక్కులను ఇచ్చారు.

అగనంపూడి టోల్‌గేటుపై దాగుడుమూతలు

- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్
- ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినందున అగనంపూడిలో టోల్‌గేటు ఎత్తివేయాలని విజ్ఞప్తి
- బుధవారం నిలిచిన వసూళ్లు.. కానరాని సిబ్బంది
- ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామంటున్న ఎన్‌హెచ్ఐ ప్రాజెక్టు డైరెక్టర్



అగనంపూడి వద్ద టోల్‌గేటు

అగనంపూడి, జూన్ 26: అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం వసూలు ఆగాయి. అయితే ఇంకా నిలిపి వేసినట్టేనని స్థానికులు భావిస్తుండగా, అలాంటిదేమీ లేదని నేషనల్ హైవే అథారిటీ అధికారులు అంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామంటున్నారు.

నగర పాలక సంస్థ పరిధిలో టోల్‌గేటు ఉండరాదన్న నిబంధనను తుంగలో తొక్కి, గత కొన్నేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఈ ప్రాంతవాసులు చాలాకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. 2019లో ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు...గాజువాక బార్ అసోసియేషన్ సాయంతో హైకోర్టులో న్యాయం పోరాటం చేసి టోల్‌గేటును ఎత్తివేయించారు. ఆ తరువాత మూడు నెలల వ్యవధిలోనే వైసీపీ అధికారంలోకి రావడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మళ్లీ టోల్‌గేటును ఏర్పాటుచేశారు. గత ఐదేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే టోల్‌గేటు తొలగిస్తామని ఇటీవల ఎన్నికల ముందు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి కార్యకర్తలు కొందరు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళన చేపట్టారు. స్టాపర్లు తొలగించి వాహనాల నుంచి ఫీజులు వసూలు చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ టోల్‌గేటును తొలగిస్తామని చెప్పారని, అయినా ఇంకా వసూళ్లు కొనసాగించడ మేమిటని ప్రశ్నించారు. టోల్‌గేటు వద్ద వసూళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. ఈ విషయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి టోల్ ఫీజుల వసూళ్లు నిలిచిపోయాయి. బుధవారం సిబ్బంది కూడా రాకపోవడంతో టోల్ బూత్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి. టోల్‌ఫీజుల వసూలు నిలిపివేయడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

డ్యామేజీని సరిచేస్తున్నాం: ఎన్‌హెచ్‌ఐ పీడీ

ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను వివరణ కోరగా...అగనంపూడి టోల్ గేట్ కొంత దెబ్బతిందన్నారు. ఆ డ్యామేజీని సరిదిద్దే పనిని చేపట్టినట్టు వెల్లడించారు. టోల్‌గేట్ నిర్వహణపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.5 కోట్లు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, జూన్ 26: వరాహలక్ష్మీ నృసింహస్వామికి గడచిన 28 రోజుల్లో హుండీలలో భక్తులు సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.2.5కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో బుధవారం పరకామణిలో హుండీల ఆదాయం లెక్కించారు. నగదు రూపంలో రూ.2,50,52,507 ఆదాయం లభించింది. 183.2 గ్రాముల స్వర్ణం, 15.125 కిలోల రజితం ఆభరణాల రూపంలో లభ్యమైంది. వాటితోపాటు 395 యూఎస్ డాలర్లు, 79 సింగపూర్ డాలర్లు, 50 కెనడాకు చెందిన డాలర్లు, మలేషియాకు చెందిన 124 రెంగార్ లభించాయి. లెక్కింపులో విశాఖ డిప్యూటీ కమిషనర్ రాధ, దేవాలయ ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలాస, గుణుపూర్, కోరాపుట్ పాసింజర్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 26: పూండి, నౌపడ మెయిన్ లైనులో భద్రతా ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 27న (గురువారం) పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), విశాఖ - గుణుపూర్ (08522), గుణుపూర్- విశాఖ (08521), కోరాపుట్- విశాఖ (08545) పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, గురువారం పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830) మూడు గంటలు ఆలస్యంగా, రాయపూర్-విశాఖ పాసింజర్ (08527) రెండు గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

ఇకపై వివేక్ ఎక్స్‌ప్రెస్ డైలీ

డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య వారానికి ఐదు రోజులు నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22504/ 22503) ప్రయాణికుల డిమాండ్ మేరకు డైలీ (ప్రతిరోజు) ఎక్స్‌ప్రెస్‌గా ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రుగర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) రైలు జూలై ఎనిమిది నుంచి, తిరుగు ప్రయాణంలోని కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503) రైలు జూలై 12వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

బైలపూడి పాలసంఘం డైరెక్టర్ల ఎన్నిక వాయిదా

- టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో అదుపులోకి పరిస్థితి



రైతులను చెదరగొడుతున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్

చీడికాడ, జూన్ 26: మండలంలోని బైలపూడి పాలసంఘంలో ఇద్దరు డైరెక్టర్లను ఎన్నిక వాయిదా పడింది. టీడీపీ, వైసీపీ మద్దతుదారుల మధ్య ఏకాభిప్రాయంగా కుదరకపోవడంతో విశాఖ డెయిరీ సూపర్ వైజర్ సమావేశాన్ని వాయిదా వేశారు. అంతకుముందు ఇరు పార్టీల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. పోలీసులు జోక్యం కల్పించుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

బైలపూడి పాలసంఘం అధ్యక్షుడు జాజిమొగ్గల నాగరాజుతో పాటు మరో డైరెక్టర్ పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సంఘంలో ఓటుహక్కు కలిగిన సభ్యులతో సమావేశం నిర్వహించారు. విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఇద్దరు డైరెక్టర్ల పదవీకాలం పూర్తయినందున కొత్తగా ఇద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కోరారు. దీనికి టీడీపీకి చెందిన పలువురు రైతులు చెరొక డైరెక్టర్ చొప్పున ఏకగ్రీవానికి ముందుకు రావాలని ప్రతిపాదించారు. దీంతో పాలసంఘం మాజీ అధ్యక్షులు నాగరాజుతో పాటు మరో 11 మంది పేర్లను పోటీకి ముందుకు వచ్చారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన జాజిమొగ్గల ఈశ్వరరావు, గొల్లవిల్లి స్వామినాయుడుతో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ సంఘం అధ్యక్షుడిగా ఇప్పటివరకూ 15 ఏళ్ల పాటు పని చేసిన నాగరాజును ఎన్నికల్లో మినహాయించి కొత్తవారికి అవకాశం ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. తాము ఏకగ్రీవానికి సిద్ధమేనని అన్నారు. దీంతో టీడీపీకి చెందిన సభ్యులు నాగరాజు కూడా పోటీలో ఉంటాడని చెప్పడంతో ఇరు వర్గాల వారు ఒక్కసారిగా లేచి వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ నారాయణరావు, ఏఎస్ఐ నాగేశ్వరరావుతో పాటు మరో 8 మంది పోలీసులు కలుగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత కూడా ఎన్నికపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు సూపర్‌వైజర్ తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి : ముగ్గురికి తీవ్ర గాయాలు



దగ్ధమైన పాక, మృతుడు భవానీ శంకర్ (ఫైల్)

మాడుగుల, జూన్ 26 : మండలంలోని గాదిరాయి గ్రామంలో పిడుగుపాటుకు ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలో బుధవారం సాయంత్రంఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో గాదిరాయి సమీపం లో ఉన్న సబ్‌స్టేషన్ ఎదురు గా ఉన్న పాకలో తల దాచుకునేందుకు వడ్డాది భవానీశంకర్, పెంటకోట ఈశ్వర్ వెంకట సత్యనారాయణ, సూర్యప్రకాష్ రావు, వడ్డాది అప్పలనాయుడు వెళ్లారు. అదే సమయంలో పాకపై పిడుగు పడింది. దీంతో పాకలో ఉన్న భవానీ శంకర్ (22) సెల్‌ఫోన్ చూస్తున్నాడు. పిడుగుపడిన దాటికి ఫోన్ పేలి మృతి చెందాడు. పాక దగ్ధమవడంతో భవాని శంకర్‌తో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు ఆ గ్రామ సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు తెలిపారు. గాయపడిన వారిలో మృతుడి తండ్రి కూడా ఉన్నారని తెలిపారు. మృతుడు భవానీశంకర్ డిగ్రీ పూర్తి చేశాడు. ఈ సంఘటనతో ఒక్కసారిగా గాదిరాయి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తండ్రికి స్వల్ప గాయాలు

- విశాఖపట్నం వెళ్తుండగా కారు బోల్తా
- బైపాస్ రోడ్డు ఇరువాడ సమీపంలో ఘటన



గాయపడిన సత్యనారాయణ

సబ్బవరం, జూన్ 26 : అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తండ్రి సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం ఆయన ఎలమంచిలి నుంచి జాతీయ రహదారి మీదగా విశాఖపట్నం కారులో వెళుతున్నారు. ఇక్కడి బైపాస్ రోడ్డులోని ఇరువాడ సమీపంలో ఒక్కసారిగా సదరు వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో సత్యనారాయణకు ముఖం పై స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతనిని విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సీఐ పిన్నింటి రమణను సంప్రదించగా ప్రమాదం జరిగిందని, కానీ తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

- విద్యార్థులు, యువత ఆకర్షితులు కాకుండా చూడాలి
- ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం కావాలి
- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ



నెహ్రూచౌక్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, జూన్ 26: మాదక ద్రవ్యాలకు అంతా దూరంగా ఉండడం వలన దేశ భవిష్యత్తు ఎంతో ఆరోగ్యకరమైనదిగా రూపొందించవచ్చునని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం పట్ల ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృత నిశ్చయంతో ఉన్నామని, అందుకు అనుగుణంగా విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 63 విలేజ్ స్థాయి కమిటీలు, 16 మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిద్వారా ప్రజల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చైతన్యం కలిగించడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు, వినియోగిస్తున్న వారి సమాచారం 14500 లేదా డయల్ 100/112కు సమాచారం తెలపాలని కోరారు. అడిషనల్ ఎస్పీలు కె.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జి.లక్ష్మణ్, డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో బాలాజీ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ మనోహర్, ఇన్‌చార్జి ఆర్డీవో వి.రమామణి, ఎస్ఈబీ సూపరింటెండెంట్ కె.జయసింహచౌదరి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శైలజారాణి, సీడ్ ఇన్‌చార్జి ఆర్గనైజర్ వి.సూర్యప్రకాశరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పలు శాఖల అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

'రాంకీ' అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలి

- తానాం గ్రామస్థులు ఆందోళన
- యాజమాన్యం తీరుపై సీఐటీయూ ప్రతినిధులు ఆగ్రహం



చెరువు వద్ద ఆందోళన చేపడుతున్న తానాం గ్రామస్థులు

పరవాడ, జూన్ 26: మండలంలోని తానాం గ్రామానికి ఆనుకుని రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం నిబంధనలను తుంగలోకి తొక్కి అక్రమంగా తవ్విన చెరువుపై ఎన్‌జీటీలో కేసు వేయడం జరిగిందన్నారు. గ్రీన్ బెల్టుకు చెందిన స్థలంలో నిబంధనలు ఉల్లంఘించి, తవ్వకాలు సాగించిన చెరువును మూసివేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆదేశాలిచ్చినా నేటికీ మూసివేయకపోవడం అన్యాయమన్నారు. ఈ చెరువులోకి ఫార్మా రసాయనాలు చేరడం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని వాపోయారు. ఈ కారణంగా పశువులు, మనుషుల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ చెరువును మూసివేసి, కాలుష్యం నుంచి తానాం ప్రజలను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రొంగలి అప్పారావు, వర్రి భవానీ, వి.కన్నంనాయుడు, వర్రి అప్పారావు, ఆర్.ఎర్రయ్యమ్మ, వి.సన్యాసి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు ససేమిరా?

- నోటి మాటతో చెబితే చేయను, రాతపూర్వకంగా ఇవ్వాల్సిందే
- మొండికేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి
- ఆ ఉత్తర్వులు తీసుకుని న్యాయస్థానానికి వెళ్లే యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి మొండిగా వ్యవహరిస్తున్నారు. రాజీనామా చేయాలని ఉన్నతాధికారులు సూచించినా లెక్క చేయడం లేదు. తనకు నోటి మాటతో చెబితే చాలదని, రాతపూర్వకంగా ఇస్తేనే రాజీనామా చేస్తానని సందేశం పంపారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి గడచిన ఐదేళ్లుగా వైసీపీ కోసం బహిరంగంగానే పనిచేశారు. టీడీపీ నాయకులను విమర్శించారు. ఒక ఉన్నత విద్యా సంస్థకు జవాబుదారీగా ఉంటూ అలా మాట్లాడడం తప్పు అయినప్పటికీ ఆయన వెనకడుగు వేయలేదు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని, యూనివర్సిటీని ఏలవచ్చునని భ్రమించారు. వైసీపీ ఓడిపోయినా కుర్చీ వదలడం లేదు. గవర్నర్ నియామకం ద్వారా తనకు పదవి వచ్చింది కాబట్టి ప్రభుత్వం దానిని రద్దు చేయలేదని ఆయన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఒకవేళ రాజీనామా చేయాలని ఆర్డర్ ఇస్తే, అది చెల్లదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అంటున్నట్టు తెలిసింది. తనను వేధిస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో తెలుసునని చెబుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై వాట్సాప్ గ్రూపుల్లో రిటైర్డ్ ఏయూ ఉద్యోగులు చాలా ఘాటుగా స్పందిస్తున్నారు. ప్రసాదరెడ్డి పవర్ మాంగర్ (పదవీ వ్యామోహం కలిగినవాడు) అని ఒకరు విమర్శించారు. ఇంకొకరు ఆయన్ను మామూలుగా పంపకూడదని, బలవంతంగా గెంటాలని సూచించారు. ఒక విద్యా సంస్థకు అధిపతిగా వ్యవహరిస్తున్న ఆయనపై ఉద్యోగులలో ఇంత వ్యతిరేకత ఉందా?...అని అంతా ఆశ్చర్యపోతున్నారు.

మూడు రోజుల్లో అన్న క్యాంటీన్ సిద్ధం



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూన్ 26 : అన్న క్యాంటీన్ పనులు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. బుధవారం ప్రాంతీయ ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ పనులు పరిశీలించారు. జూన్ 18 లోగా అన్న క్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మునిసిపల్ అధికారులు అన్న క్యాంటీన్ భవనం శుభ్రం చేయించి రంగులు వేయిస్తున్నారు. వాష్‌బేసిన్లు, డైనింగ్ టేబుళ్లు, విద్యుత్, నీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తున్నారు. మూడు రోజుల్లో మొత్తం పనులు పూర్తి కానున్నాయని ఆర్డీవో తెలిపారు.

రెండు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

- నలుగురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తింపు



వాకపల్లిలో రోగులకు వైద్య తనిఖీలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పేరినాయుడు

చీడికాడ, జూన్ 26: మండలంలోని కోనాం శివారు గుడివాడ, వాకపల్లి గిరిజన గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాల్లో గుడివాడలో 23 మందికి, వాకపల్లిలో 18 మందికి తనిఖీలు చేసి, వీరిలో నలుగురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. జ్వర పీడితులతో పాటు మరికొంతమందికి రక్తపరీక్షలు చేశారు. కోనాం సబ్‌సెంటర్ హెల్త్‌అసిస్టెంట్ పెంటకోట పేరినాయుడు మందులు అందజేశారు.

అనంతరం గుడివాడలో మురుగునీరు కాలువను పరిశీలించారు. రెండు గ్రామాల్లో వాటర్‌ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా పేరినాయుడు మాట్లాడుతూ గుడివాడ గ్రామంలో ఉన్న మురుగునీటిని నిర్మూలించి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని, రెండు గ్రామాల్లో వాటర్‌ట్యాంకులు క్లీనింగ్ చేయించాలని కోనాం సచివాలయ కార్యదర్శిని ఆయన కోరారు. ఈ మేరకు సచివాలయంలో లిఖితపూర్వకంగా వినతి అందజేశారు. ఈ శిబిరంలో ఆశవర్కర్లు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 54.37 శాతం ఉత్తీర్ణత

అనకాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 54.37 శాతం ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 10 వరకు జరిగాయి. జిల్లా నుంచి 3,031 మంది పరీక్షలకు హాజరు కాగా 1,648 మంది(54.37 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు 1,928 మంది బాలురు హాజరు కాగా, 1,037 మంది(53.79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,103 పరీక్షలకు హాజరు కాగా, 611 మంది(55.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జవాబు పత్రాల రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించే అవకాశం కల్పించారు. దీని కోసం దరఖాస్తు చేసుకోవాలనుకొనే విద్యార్థులు ప్రధానోపాధ్యాయులను సంప్రతించాలని పేర్కొన్నారు.

ఒకటి నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి రూరల్, జూన్ 26 : జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు జూలై ఒకటో తేదీ నుంచి అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఈ పరీక్షలు జరుపుతారని వివరించారు. 2023-24 సంవత్సరంలో అక్రిడేషన్ కలిగిన వారు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రిపోర్టులు మరుసటి రోజు ఉదయం పొందవచ్చని, రోజుకు 50 మందికి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 70933 34466, 70933 34454లో సంప్రదించాల్సిందిగా కోరారు.

బైక్ పై నుంచి పడి ఒకరి వ్యక్తి మృతి

గొలుగొండ, జూన్ 26 : రోడ్డు ప్రమాదంలో బైక్ పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావణాపల్లి గ్రామానికి చెందిన రాజాన అప్పలనాయుడు (40) రావణాపల్లి గ్రామంలో రెండురోజుల క్రితం ప్రమాదంశాత్తూ బైక్ పై నుంచి పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పలనాయుడు బుధవారం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘాట్‌లో ప్రయాణం.. భయంభయం!

అసలే ఘాట్ మార్గం.. ఆపై అటవీ ప్రాంతం.. చీకటి పడితే గాడాంధకారం.. ఈ క్రమంలో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న బస్సులతో ప్రయాణికుల్లో భయంభయం.. అయినా పట్టించుకోని అధికార యంత్రాంగం.. ఇదీ సీలేరు మీదుగా ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రజల దుస్థితి.

- మొరాయిస్తున్న బస్సులు.. ప్రయాణికుల అగచాట్లు
- కండిషన్ లేని ఆర్టీసీ సర్వీసులతో తప్పని ఇబ్బందులు
- వర్షాలు కురిస్తే కారిపోతుండడంతో ప్రత్యక్ష నరకం
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్నా పట్టించుకోని అధికారులు

సీలేరు, జూన్ 26:

ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సులు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. తరచూ ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో భయాందోళన పరిస్థితులు నెలకొంటున్నాయి. వారం రోజులుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఘాట్ రోడ్డులోని తరచూ సాంకేతిక సమస్యలతో ఆగిపోతుండడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు.

విశాఖపట్నం ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలం, సీలేరు ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొన్నేళ్లుగా నడుస్తున్నాయి. కొంత కాలంగా కండిషన్‌లో లేని బస్సులను పంపించడం వల్ల ఎక్కడబడితే అక్కడ ఆగిపోతున్నాయి. సీలేరు-గూడెంకొత్తవీధి మార్గంలో ఆర్టీసీ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. శనివారం రాత్రి విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు సాంకేతిక సమస్య కారణంగా లంకపాకలు సమీపంలో నిలిచిపోయింది. ఆదివారం ఉదయం సప్పర్ల ఘాట్‌లో సీలేరు-విశాఖపట్నం రాత్రివేళ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు ఐదు గంటల పాటు ఘాట్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సుమారు 12:30 గంటలకు భద్రాచలం నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులు విశాఖపట్నం పంపించారు.

వర్షం కురిస్తే తడవాల్సిందే..!

కాలం చెల్లిన, ఏమాత్రం కండిషన్‌లో లేని బస్సులు నడుపుతుండడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ఏమాత్రం వర్షం కురిసినా కొన్ని బస్సులు కారిపోతుండడంతో ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. విశాఖపట్నం నుంచి భద్రచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం ఆరు గంటలకు నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంది. అదే సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో బస్సుపై కప్పు నుంచి కిందకు వర్షపు నీరు కారిపోవడం వల్ల డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు తడిచి ముద్దయ్యారు. వర్షం తగ్గేవరకు ప్రయాణికులు తడుచుకుంటూ ప్రయాణం సాగించాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా విశాఖపట్నం ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల అవస్థలను గుర్తించి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సప్పర్ల ఘాట్ రోడ్డులో ఆదివారం రాత్రి నిలిచిపోయిన సీలేరు-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్



భద్రాచలం ఆర్టీసీ బస్సులో సోమవారం వర్షం నీరు కారిపోవడంతో తలపై గుడ్డ వేసుకుని బస్సు నడుపుతున్న డ్రైవర్



ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, వార్డెన్లతో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చండి

» గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

అరకులోయ, జూన్ 26: మన్యంలో బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, వార్డెన్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పాల్సిందేనని, సీటు లభించక బడిఈడు పిల్లలు గ్రామాల్లో ఉండిపోయారన్న మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. వసతిగృహంలో విద్యార్థులకు అవసరమయ్యే ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, వంటపాత్రలు, ఇతరత్రా సామగ్రి కోసం నివేదికలు తయారు చేసి అందజేయాలని డీడీ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని తెలియజేస్తే కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లి భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. లక్ష్యాలకు తిలోదకాలిస్తే చర్యలు తప్పవని డీడీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏటీడబ్ల్యూవోలు మల్లికార్జునరావు, వెంకటరమణ, మూడు మండలాల పరిధిలోని ఆశ్రమోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.

82 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

» మరో ఇద్దరు పరారీ: సీఐ అప్పలనాయుడు



పట్టుబడిన గంజాయి బస్తాలు, నిందితులతో పోలీసులు

చింతపల్లి, జూన్ 26: ఒడిశా నుంచి మైదాన ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గూడెంకొత్తవీధి సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురగేశ్ కొంత కాలంగా రింతాడ పంచాయతీ కుమ్మరవీధిలో కిరాణా దుకాణం నడుపుకుంటున్నాడన్నారు. తక్కువ సమయంలో అధికంగా నగదు సంపాదించాలనే దురాశతో గంజాయి రవాణాను ఎంచుకున్నాడని, గిరిజన ప్రాంతంలో గంజాయి లభించకపోవడంతో ఒడిశా నుంచి తెప్పించుకుని మైదాన ప్రాంతాలకు రవాణా కోసం సిద్ధం చేశాడని చెప్పారు. జర్రెల, రింతాడ మీదుగా తుని జాతీయ రహదారి వరకు గంజాయి తరలించేందుకు పైలెట్‌గా చింతపల్లి మండలం బురిసింగి గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణను, మరో ఆటో డ్రైవర్‌ను పెట్టుకున్నట్టు చెప్పారు. మంగళవారం రింతాడ జంక్షన్‌లో ఎస్‌ఐ అప్పలసూరి, సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తూ వారు పట్టుబడ్డారన్నారు. గంజాయి తరలిస్తున్న మురగేశ్, సత్యనారాయణను అరెస్టు చేశామని, ఆటో డ్రైవర్, గంజాయి విక్రయించిన వ్యక్తి పరారీలో ఉన్నారని ఆయన వివరించారు. నిందితుల నుంచి 82 కిలోల గంజాయి, ఆటో, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

1న నిరసన దినంగా పాటించండి

» మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్

జి.మాడుగుల, జూన్ 26: మావోయిస్టు విప్లవోద్యమం, పీడిత ప్రజలపై పాలకవర్గాలు కగార్ పేరుతో కొనసాగిస్తున్న సైనిక దాడులు, మరణకాండలను ఖండిస్తూ జూలై 1న నిరసన దినంగా పాటించాలని మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పేరుతో ఒక ఒక ప్రకటన లో విడుదల చేశారు. ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి, మేధావులు ఏవోబీ ప్రాంతంలో జూలై 1న నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న మావోయిస్టు విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి పాలకవర్గాలు ఆపరేషన్‌తో వ్యూహాత్మక సైనిక శిబిరాల ద్వారా దండకారణ్యంలో కొనసాగిస్తున్న దాడుల్లో 132 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నర సంహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వాలు తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, దండకారణ్యంలో శాంతిని నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు.



మావోయిస్టుల కరపత్రం ఇదే..

గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో తిరుపాల్

జి.మాడుగుల, జూన్ 26: గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏటీడబ్ల్యూవో తిరుపాల్ ఆదేశించారు. ఎంఈవో కార్యాలయంలో బుధవారం జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి హెచ్‌ఎం నెలకు 15 సార్లు స్కూల్ కాంప్లెక్స్‌ల వారిగా తనిఖీలు చేపట్టి ఎంఈవో కార్యాలయానికి నివేదికలు అందజేయాని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబూరావు పడాల్, హెచ్‌ఎంలు ఎం.బాలరాజు, కె.అప్పలకొండ, బి.రవిబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

» తాగునీరు, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జూన్ 26: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చెప్పారు. మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాడేరు, అరకులో కూటమి అభ్యర్థులు గెలవకపోవడంతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కుంటుబడుతుందని కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. ఓటమిని కూడా విజయంగానే భావించాలన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబును ఇటీవల కలవగా, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రధానంగా తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు గిరిజన ప్రాంత సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఆదివాసీల జీవన విధానం, సమస్యలపై అనుభం కలిగిన అయ్యన్నపాత్రుడు సభాపతిగా ఎన్నిక కావడం, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, హోం మంత్రి అనితలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో సమస్యలను నేరుగా వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. చంద్రబాబు రూ.4 వేలకు పింఛన్ పెంచారనే విషయం ఆదివాసీలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, పాంగి రాము, సరమండ శ్రీధర్, సేవా ఈశ్వరమ్మ, లోతుగెడ్డ సర్పంచ్ సునీల్, నాగభూషణం, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.





చింతపల్లి సంతలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శివకిశోర్... హుకుంపేట రోడ్డులో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదాం..

» గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లొద్దు

» చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

» మన్యంలో అన్ని మండలాల్లోనూ అవగాహన ర్యాలీలు



అరకులో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

చింతపల్లి/కొయ్యూరు/జి.మాడుగుల/గూడెంకొత్తవీధి/అరకులోయ/సీలేరు/హుకుంపేట/పెదబయలు/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు, జూన్ 26: డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదామని చింతపల్ల అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మన్యంలోని అన్ని మండలాల్లో విద్యార్థులు, పోలీసులు అవగాహన ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. అలాగే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. చింతపల్లి వారపు సంతలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోకూడదని సూచించారు. గంజాయి రవాణా నియంత్రణకు నిఘా పెట్టామన్నారు. ఇందుకోసం 9381123100 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రవాణా, సాగుకు సంబంధించిన సమాచారం ఈ నంబరుకు కాల్ చేసి చెప్పవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. కొయ్యూరులో సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. జి.మాడుగులలో సీఐ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సారా విక్రయాలు సమూలంగా అరికట్టడానికి మండల వాసులు సహకరించాలని కోరారు. అరకులోయ సీఐ రుద్రశేఖర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాల వినియోగంతో తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని చెప్పారు. యువతీ, యువకులు మాదకద్రవ్యాల వ్యాపారంలో భాగసాములైతే చట్టపరంగా కేసులు నమోదుచేసి శిక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఎస్‌ఐ ఆర్.సంతోస్ స్పష్టం చేశారు.

హుకుంపేటలో సీఐ నాయుడు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గంజాయి సాగు నిర్మూలనకు అందరూ సహకరం అందించాలని కోరారు. గ్రామాల్లో గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండడంతో పాటు దీనివల్ల వచ్చే ముప్పును గుర్తు చేసుకోవాలని చెప్పారు. గూడెంకొత్తవీధిలో యువతీ, యువకులు డ్రగ్స్ జోలికి వెళ్లరాదని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువకులు గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు.

సీలేరులో ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ యువతీ, యువకులు మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత జీవితాలను నాశనం చేసుకోకూదని సూచించారు. పెదబయలులో ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల అనేక జీవితాలు ఛిద్రమవుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. డుంబ్రిగుడ మండలంలోని కించుమండ వారపు సంతలో ఎక్సైజ్ శాఖ అధికారులు నాగమణి, పి.సత్యనారయణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అనేక మంది చట్టానికి వ్యతిరేకంగా గంజాయి సాగు చేస్తున్నారని, వారు జైలుకు వెళ్లడం వల్ల కుటుంబ సభ్యులు నడిరోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి సాగు, రవాణా చేస్తే నేరమని స్పష్టం చేశారు. ముంచంగిపుట్టులో ఎస్‌ఐ కె.రవీంద్ర మాట్లాడుతూ గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో చింతపల్లి సీఐ కె.రమేశ్, ఎస్‌ఈబీ సీఐ రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, జి.మాడుగుల ఏపీఎస్పీ ఆర్ఐ రమణ, హుకుంపేట ఎస్‌ఐ అప్పలసూరి, సీలేరు సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పాండే, డుంబ్రిగడ ఏఎస్‌ఐ పురందర్, హోంగార్డు కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్ ముంగిట పెను సవాళ్లు

... 3వ పేజీ తరువాయి

కూడా జనానికి అర్థం కాని పరిస్థితి. ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన శాశ్వత అధికారులు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. దీంతో ప్రస్తుతం జిల్లా అయినప్పటికీ డివిజన్ స్థాయి పాలన సాగుతున్నట్టుగానే ఉంది.

26 నెలల్లో ఒక్కమారే ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేయాల్సిన తీర్మానాల కోసం ప్రతి మూడు నెలలకు ఒకమారు ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. ఇది ఐటీడీఏలకు రాజ్యాంగ పరంగా కల్పించిన అవకాశం. కానీ 2022 ఏప్రిల్‌లో జిల్లా ఏర్పడిన తరువాత కేవలం ఒకమారు మాత్రమే ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సుమారుగా 26 నెలల్లో కేవలం ఒకసారి మాత్రమే పాలకవర్గ సమావేశం నిర్వహించారంటే ఐటీడీఏకు ఛైర్మన్‌గా ఉన్న కలెక్టర్, ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగా వున్న పీవోకు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. గిరిజనుల అభ్యున్నతి కోసం పరితపించే ఐఏఎస్ అధికారులు పీవోలుగా పని చేసిన పాడేరు ఐటీడీఏకు ఈ దుస్థితి ఏర్పడడం చాలా బాధాకరం. అలాగే సబ్‌కలెక్టర్ కార్యాలయం ద్వారా గిరిజనులకు రెవెన్యూ పరమైన సేవలు సక్రమంగా అందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదనే వాదన బలంగా వినిపిస్తున్నది. కొత్త కలెక్టర్ తన కార్యాలయం నుంచి మొదలు పెట్టి ఐటీడీఏ, సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి తన పరిధిలో ఉన్న ప్రభుత్వ శాఖల్లో స్థితిగతులపై దృష్టి సారించి గిరిజనులకు కొత్త ప్రభుత్వం ద్వారానైనా ఆశించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందించాలని మన్యం వాసులు కోరుతున్నారు.

జోలాపుట్టు జలాశయం వెలవెల

» గత ఏడాదితో పోల్చితే 15 అడుగుల నీరు తక్కువ



జలాశయంలో నీరు తక్కువగా ఉన్న నీరు

ముంచంగిపుట్టు, జూన్ 26: జోలాపుట్టు జలాశయం నీరు లేక వెలవెలబోతున్నది. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు ఠారెత్తించడంతో మత్స్యగెడ్డ పాయలు పూర్తి స్థాయిలో అడుగంటిపోయిన విషయం తెలిసిందే. దీంతో జోలాపుట్టు ప్రధాన జలాశయంలో రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ జలాశయంలో మొత్తం 2750 అడుగుల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, బుధవారం 2685 అడుగుల నీటి మట్టం నమోదైంది. గత ఏడాది ఇదే సమయానికి 2700.60 అడుగుల నీరు ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీంతో ఈ ఏడాది 15 అగుడులు నీరు తక్కువగా ఉంది. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ మత్స్యగెడ్డలోకి వరదనీరు చేరవడం లేదు. ఈ ఏడాది వేసవిలో పలు చోట్ల గెడ్డ పాయలు పూర్తి స్థాయిలో అడుగంటిపోవడంతో ప్రస్తుతం జలాశయానికి ఇన్‌ఫ్లో లేదు. దీంతో జలాశయంలో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే తప్ప జలాశయానికి పూర్వవైభవం వచ్చే అవకాశం లేదు.

గిరిజన ప్రాంతంలో సేవలందించడం అదృష్టం

... 3వ పేజీ తరువాయి

విజయవంతంగా నిర్వహించగలిగారన్నారు. జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి.. కలెక్టర్ విజయసునీత సేవలను కొనియాడారు. అనంతరం ఆమెకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో చింతూరు ఆర్డీవో చైతన్య, ఏఎస్పీ కె.ధీరజ్, డీఆర్వో బి.పద్మావతి, ఎస్‌డీసీలు వీవీఎస్.శర్మ, భవాని, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డీఎంహెచ్‌వో జమాల్ బాషా పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు

చింతపల్లి, జూన్ 26: గిరిజన రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ చెప్పారు. పెదబరడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆత్మ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా సమగ్ర యాజమాన్యంపై బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు పెట్టుకోవాలన్నారు. అలాగే విత్తన శుద్ధి చేసిన వంగడాలను నాటుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కంటా జాహ్నవి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి, రాగి, సామ, కొర్ర పంట సాగులో మెళకువలు పాటించాలని సూచించారు. రాగి సాగులో గుళి, జమున పద్ధతుల్లో సాగు చేస్తే రెంట్టింపు దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి ఎం.విజయలక్ష్మి, అగ్రి ల్యాబ్ ఏవో పద్మశోభ, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, లంబసింగి ఎఫ్‌పీవో సీఈవో గీత పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు...

» సీలేరులో బైకులు, పెట్రోల్ చోరీలతో వాహన చోదకుల బెంబేలు

సీలేరు, జూన్ 26: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరులో ద్విచక్ర వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. బైక్‌లు, పెట్రోల్ దొంగతనాలతో వాహనం ఎక్కడైనా పెట్టాలంటేనే భయాందోళన చెందుతున్నారు. సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్, అల్లూరివీధి, దుర్గావీధితో పాటు జెన్‌కో కాలనీల్లో ద్విచక్ర వాహనాలు చాలా వరకు ఇళ్ల బయట పార్కింగ్ చేసి ఉంచుతారు. ఎవరో తప్పితే తమ బైకులను దాదాపు అందరూ బయటే వదిలేస్తారు. అయితే ఇటీవల సీలేరులో బైకులు అపహరణకు గురవుతున్నాయి. మార్కెట్ రోడ్డులో ఒక పల్సర్ బైకును దొంగలు అపహరించుకుని పోగా, రెగ్యులేటర్ డ్యాం వద్ద నైట్ డ్యూటీలో ఉన్న జెన్‌కో హోంగార్డు బైకును కూడా చోరీ చేశారు. అలాగే ఆరవ క్రాస్ రోడ్డులో ఒక ప్రైవేట్ ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి వద్ద బైకును దొంగలు అపహరించే ప్రయత్నం చేయగా, శబ్దం రావడంతో ఇళ్లల్లో ఉన్న పరిసర వాసులు బయటకు రావడంతో దొంగలు అక్కడి నుంచి ఉడాయించారు. అలాగే స్థానిక తొమ్మిదిన్నర క్రాస్ రోడ్డులో టీడీపీ నాయకుడు నక్కా తిరుమలరావు ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉంచిన బైకు నుంచి పెట్రోల్‌ను దొంగలించారు. గతంలో కూడా రెండుసార్లు బైకు నుంచి పెట్రోల్ దొంగిలించారని, దొంగలు పెట్రోల్ తీసే ప్రయత్నంలో బైకు డోరు పైపులను ఇరగొట్టి పెట్రోల్ మొత్తం తీసేశారని ఆయన వాపోయారు. దీనిపై స్థానిక పోలీసులు నిఘా పెట్టి బైకు, పెట్రోల్ దొంగల ఆగడాలను అదుపు చేయాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఎంఈసీ గ్రూపు పునరుద్ధరించాలి

కొయ్యూరు, జూన్ 26: కాకరపాడు గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపు పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాడ్ చేస్తున్నారు. ఈ గ్రూపు పునరుద్ధరణకు సాంకేతిక సమస్యలు ఉంటే కనీసం హెచ్‌ఈసీ గ్రూపునైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల గత విద్యా సంవత్సరం వరకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో కొనసాగింది. ప్రతీ గ్రూపులో 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించేవారు. దీంతో కళాశాలలో ప్రథమ, ద్వితీయ విద్యా సంవత్సరాలు కలిపి 320 మంది విద్యార్థులు విద్యనభ్యసించేవారు. పదో తరగతి ప్యాసైన విద్యార్థులు ఉన్నత చదువులకు ఈ కళాశాల ఉపయోగకరంగా ఉండేది. అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఈసీ గ్రూపును ఎత్తి వేశారు. దీంతో 40 మంది విద్యార్థులు ప్రవేశాలకు ఇబ్బంది ఏర్పడింది. ఫలితంగా కళాశాలలో చదువుకోవాలని ఆశ పడే విద్యార్థులకు సీట్లు దొరక్క ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ విద్యా సంవత్సరం ఆరంభంలో కొత్తగా 160 మంది విద్యార్థులకు ఈ కళాశాలలో ప్రవేశం ఉండగా ఈ విద్యా సంవత్సరం గ్రూపును ఎత్తి వేయటంతో కేవలం 120 మందికి మాత్రమే సీట్లు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఎంఈసీ లేదా హెచ్‌ఈసీ గ్రూపులను ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దేవరాపల్లి వీఆర్వో మృతి



సాల్మన్‌రాజు (ఫైల్)

గూడెంకొత్తవీధి, జూన్ 26: మండలంలోని దేవరాపల్లి వీఆర్వో చల్లంగి సాల్మన్‌రాజు అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా మూత్రపిండాల వ్యాధితో ఆయన బాధపడుతున్నారు. సోమవారం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో బుధవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. అతనికి భార్య, ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. వీఆర్వో మృతికి రెవెన్యూ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

మద్దిగరువు వారపు సంతకు ఆశీల పాట

జి.మాడుగుల, జూన్ 26: మండలంలోని బొయితి పంచాయతీ మద్దిగరువు వారపు సంతకు బుధవారం ఆశీల పాట నిర్వహించినట్టు ఈవోపీఆర్డీ డేవిడ్ తెలిపారు. స్థానిక సర్పంచ్ మాలన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ పాటను మద్దిగరువు గ్రామానికి చెందిన సిహెచ్.గణపతి రూ.8 వేలకు దక్కించుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరభద్రరావు, కార్యదర్శులు రవిశాస్త్రి, నాయుడు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల జోరు

» ముంచంగిపుట్టులో నకిలీ వంద నోటు

ముంచంగిపుట్టు, జూన్ 26: మండల కేంద్రంలో నకిలీ నోట్లు జోరుగా చలామణి అవుతున్నాయి. బుధవారం వంద రూపాయల నకిలీ నోటు దర్శనమిచ్చింది. ఆ నోటును గుర్తించిన వ్యాపారులు, స్థానికులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆ నోటు నకిలీదిగా తెలియడంతో అందరూ షాక్‌కు గురయ్యారు. నకిలీ వంద నోట్లు మార్కెట్‌లోకి వస్తున్నందున వ్యాపారులతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. నకిలీ వంద నోట్లపై ప్రత్యేక దృష్టిసారిస్తామని, ఎవరికైనా నకిలీ నోట్లుగా అనుమానం వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే సంత రోజుల్లో రద్దీ సమయాల్లో నకిలీ నోట్లు మార్చేందుకు ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు.